


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 18-06-2025 | సంపుటి - 24 | సంచిక - 47 | రూ : 4 | పేజీలు: 8



2లో

## బీసీ రిజర్వేషన్ల బాధ్యత కాంగ్రెస్, భాజపాలదే

- 42 శాతానికి పెంచాకే స్థానిక ఎన్నికలు జరపాలి
- అత్యవసర సమావేశంలో నేతల డిమాండ్

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాకే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు భవిష్యత్తు కార్యాచరణ'పై మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాలు బీసీ మేధావుల అత్యవసర సమావేశం జరిగింది. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్

తరువాయి 2లో

## అవినీతిలోనే
# కాళేశ్వరం బ్రహ్మాండం

- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క

భూపాలపల్లి : గత పదేళ్లుగా రాష్ట్ర వనరులను దోపిడీ చేసిన వారు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ప్రభుత్వం గ్రూప్ 1 పరీక్ష ఎందుకు నిర్వహించలేదని, మహిళా పొదుపు సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపెల్లిగోరి మండలం చెన్నాపూర్‌లో 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను... ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి భట్టివిక్రమార్క మంగళవారం ప్రారంభించారు. రూ.8.70 కోట్లతో మూడు 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణ పనులకు భూపాలపల్లి

తరువాయి 2లో







2లో

## బనకచర్లపై
# చర్చిద్దాం రండి...

- అన్ని పార్టీలనూ కలుపుకొని ప్రభుత్వ కార్యాచరణ
- నేడు అఖిలపక్ష ఎంపీలకు మంత్రి ఉత్తమ్ ప్రజంటేషన్
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ సహా ఎంపీలందరికీ ఆహ్వానం
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి



# బాంబుల వర్షం

- ఇరాన్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్
- ఖమేనీ సన్నిహిత సలహాదారు మృతి
- టెహ్రాన్‌లో భయానక పరిస్థితులు
- నగరాన్ని వీడుతున్న జనం
- జీ7 నుంచి అర్థంతరంగా వచ్చేసిన ట్రంప్
- కాల్పుల విరమణ కంటే మెరుగైన పరిష్కారం కోసం చూస్తున్నాం.. ఖమేనీ ఎక్కడున్నారో తెలుసని వ్యాఖ్య
- ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు
- మొస్సాద్ కేంద్ర కార్యాలయంపై ఇరాన్ దాడి

2లో

# చెవిరెడ్డి భాస్కరరెడ్డి అరెస్టు

- మద్యం కేసులో ఆయన సన్నిహితుడు వెంకటేశ్‌నాయుడు కూడా..
- శ్రీలంకకు పారిపోతుండగా బెంగళూరు విమానాశ్రయంలో అడ్డగింత
- వారిరువురిపై లుక్‌అవుట్ సర్క్యులర్ ఉండటంతో సిట్‌కు సమాచారం
- బెంగళూరు వెళ్లి అరెస్టు చేసిన సిట్ అధికారులు
- రాజ్ కెసిరెడ్డి నుంచి చెవిరెడ్డికి చేరిన మద్యం ముడుపులు
- ఆ సొత్తే గత ఎన్నికల్లో పంపిణీ
- రూ.250-300 కోట్ల వరకూ ఇలా తరలించినట్లు సిట్ గుర్తింపు
- ఈ కేసులో పలువుర్ని నిందితులుగా చేరుస్తూ మెమో


2లో



## అమరావతిలో
# మరో 2 కీలక ప్రాజెక్టులు

- కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు ఉమ్మడి సెక్రటేరియట్
- ఉద్యోగులకు గృహసముదాయం
- రూ.2,787 కోట్లతో నిర్మించేందుకు కేంద్రం ఆమోదం
- ఇప్పటికే 22.53 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

దిల్లీ, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించి మరో ముందడుగు పడింది. అమరావతిలో రెండు కీలకమైన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల కోసం ఉమ్మడి కేంద్ర సచివాలయం, అక్కడ పనిచేసే ఉద్యోగులకు గృహసముదాయం నిర్మించాలని నిర్ణయించింది. ఈ రెండు ప్రాజెక్టులను రూ.2,787 కోట్లతో చేపట్టనుంది. వాటిలో ఉమ్మడి కేంద్ర సచివాలయానికి (కామన్ సెంట్రల్ సెక్రటేరియట్)కి రూ.1,458 కోట్లు, ఉద్యోగుల నివాస సముదాయానికి (జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామిడేషన్)కి రూ.1,329 కోట్లు వెచ్చించనుంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ చేసిన ఈ ప్రతిపాదనలకు ఆర్థికశాఖ ఆమోదముద్ర వేసి, మంగళవారం

తరువాయి 2లో




## మరో చరిత్రకు
# విశాఖ ముస్తాబు..

- ప్రపంచ రికార్డుకు సిద్ధమవుతున్న 'యోగాంధ్ర-2025'
- సాగరతీరాన చకచకా ఏర్పాట్లు

2లో

# బనకచర్లపై చర్చిద్దాం రండి

హైదరాబాద్: ఏపీ చేపట్టిన గోదావరి బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు రాకుండా అడ్డుకునేలా అన్ని పార్టీలను కలుపుకొని కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో అన్ని పార్టీల ఎంపీలకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఈ మేరకు రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ ఆహ్వాన లేఖలు పంపారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించడంతోపాటు మంత్రి ఉత్తమ్ వారిద్దరికీ ఫోన్ కూడా చేశారు. బనకచర్ల ప్రాజెక్టును గట్టిగా ప్రతిఘటించడంతోపాటు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి తెచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ.. ఈ ఏడాది జనవరిలోనే కేంద్రానికి లేఖ రాశాం. దీనికి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పందించి.. మే 28న రాష్ట్రానికి లేఖ రాశారు. బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ కేంద్ర ప్రభుత్వానికి అందలేదని తెలిపారు. అందితే నీటి కేటాయింపుల్లో ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, ట్రైబ్యునల్ తీర్పులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలతోపాటు రాష్ట్ర విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ డీపీఆర్‌ను సమీక్షిస్తామని పేర్కొన్నారు. తర్వాత జూన్ 3న సీఎం, నేను ఢిల్లీలో సీఆర్ పాటిల్‌ను కలిసి మరోసారి అభ్యంతరాలను లేవనెత్తాం. ఈ నెల 13న మరోమారు నేను లేఖ రాశాను. సీడబ్ల్యూసీ అనుమతులను నిలువరించాలని డిమాండ్ చేశాను. ఈ క్రమంలో భవిష్యత్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు అన్ని పార్టీల ఎంపీలతో సమావేశానికి ఏర్పాట్లు చేశాం'' అని పేర్కొన్నారు. 19న కేంద్ర మంత్రితో ఉత్తమ్ భేటీ: బనకచర్ల ప్రాజెక్టుపై ఈ నెల 19న కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో సమావేశం కానున్నారు. ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ఏపీ ముందుకు వెళ్తుండటం, ఇటీవలి సమావేశాల్లో కేంద్ర సంస్థలకు చెందిన పలువురు అధికారులు చేసిన వ్యాఖ్యలపై పాటిల్‌కు వివరించనున్నట్లు తెలిసింది.

# అమరావతిలో మరో 2 కీలక ప్రాజెక్టులు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ రెండు ప్రాజెక్టులను కేంద్ర ప్రజాపనుల విభాగం (సీపీడబ్ల్యూడీ) చేపడుతుంది. ఉమ్మడి కేంద్ర సచివాలయ నిర్మాణం కోసం 2018లోనే అప్పటి తెదేపా ప్రభుత్వం రాజధానిలో సీపీడబ్ల్యూడీకి 22.53 ఎకరాలు కేటాయించింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ (ఏజీసీ) పరిధిలో 5.53 ఎకరాలు, దానికి వెలుపల 17 ఎకరాలు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా అమరావతిపై కక్షగట్టి ఎక్కడి పనులు అక్కడ నిలిపేసింది. ఒకపక్క జగన్ ప్రభుత్వం మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు దిగడంతో పాటు దాన్ని సవాల్ చేస్తూ కోర్టులో కేసులు నడుస్తుండటంతో... అమరావతిలో నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు రాలేదు. 2024లో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరిగి ఆ రెండు ప్రాజెక్టుల్ని పట్టాలెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతూ వచ్చింది. రాజధానిలో భూ కేటాయింపుల సమీక్ష కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సైతం సీపీడబ్ల్యూడీకి 22.53 ఎకరాల కేటాయింపునకు మళ్లీ ఆమోదముద్ర వేసింది. ఇది వరకు కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధానిలో విడిడిగా స్థలాలు కేటాయించగా, ఇప్పుడు వాటిని రద్దు చేసి.. కేంద్ర ప్రభుత్వ విభాగాల కార్యాలయాలన్నింటినీ ఒకే ప్రాంగణంలోకి తెచ్చేలా ఉమ్మడి సెక్రటేరియేట్ నిర్మాణం చేపట్టనున్నారు. దీనిపై ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలసి విన్నవించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రి పెమ్మసాని వీటి గురించి చర్చిస్తూ వచ్చారు. అన్ని ప్రక్రియలు పూర్తయి ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన నిధులు సమకూర్చడానికి ఆర్థికశాఖ మంగళవారం ఆమోదముద్ర వేసింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులను మనోహర్‌లాల్ ఖట్టర్ పెమ్మసానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, మనోహర్‌లాల్ ఖట్టర్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# అవినీతిలోనే కాళేశ్వరం బ్రహ్మాండం

(మొదటిపేజీ తరువాయి)

మంజూర్‌నగర్‌లో మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో భట్టి మాట్లాడారు. ''గత భారాస ప్రభుత్వంలో ప్రతి రూపాయిని పాలకులు దోపిడీ చేసినందునే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారు. రూ.38 వేల కోట్లతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును గత పాలకులు రీడిజైన్ పేరుతో రూ.1.28 లక్షల కోట్లకు పెంచి నిర్మించినా.. పనికిరాకుండా చేశారు. రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేసి, మళ్లీ వారే ఎంతో బ్రహ్మాండంగా నిర్మించినట్లు చెబుతున్నారు. రూ.కోట్ల అవినీతిలోనే ఆ ప్రాజెక్టు బ్రహ్మాండం. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు పరిశీలించి, ప్రాజెక్టు అత్యంత ప్రమాదకరంగా ఉందని తెలిపారు. నిపుణులైన ఇంజినీర్ల సూచనలు పాటించకుండా.. కట్టడంతోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి వచ్చింది'' అని భట్టి విమర్శించారు. సమావేశంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మరో చరిత్రకు విశాఖ ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి)

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ ముస్తాబవుతోంది. చరిత్రలో నిలిచి పోయేలా యోగాంధ్ర2025కు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రపంచరికార్డు సృష్టించేలా సాగరతీరంలో 5లక్షల మందితో యోగాసనాలు వేయించేందుకు రంగం సిద్ధమవుతోంది. వేదికల పనులు చకచకా సాగుతున్నాయి. 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ఆర్‌కే బీచ్ నుంచి భోగాపురం వరకూ..**

విశాఖ ఆర్కేబీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వరకు తీరం వెంబడి యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బీచ్ రోడ్డులో 326 కంపార్ట్‌మెంట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రతి 40 అడుగులకో చిన్న వేదిక ఏర్పాటుచేస్తున్నారు. ప్రధానవేదిక సమీపంలో రోడ్డుపై పచ్చటి తివాచీలు పరుస్తున్నారు. బీచ్ రోడ్డులో పార్కు హోటల్ తర్వాత నుంచి జనరల్ కంపార్ట్‌మెంట్లు ఉంటాయి. ప్రధానవేదిక వద్ద కార్యక్రమాలు తెలిసేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ నెల 19 నుంచి బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలు ఆపేస్తారు.

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను కూడా తనిఖీ చేశారు. ఈ పర్యటన అనంతరం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమ నిర్వహణకు చేపడుతున్న చర్యలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలను ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి స్వీకరించారు. ప్రపంచ రికార్డు నెలకొల్పేలా యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

*** యోగా డే డిక్లరేషన్ చేద్దాం**

సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఒక డిక్లరేషన్ గా తీసుకుందాం. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో అంతర్భాగంగా మార్చేందుకు కృషి చేద్దాం. విశాఖలో ఒక చారిత్రక ఘట్టానికి నాంది పలుకుతున్నాం, అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 కోట్ల మంది ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం 5 లక్షల మందితో యోగా చేసేందుకు వేదిక కానుందని, ఈ కార్యక్రమంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

# బాంబుల వర్షం



**యోగా అందరి జీవితాల్లో భాగం కావాలి**

యోగా దినోత్సవ నిర్వహణలో భాగంగా భారతీయ నౌకాదళం కూడా ఆర్కే బీచ్ సమీపంలో 11 నౌకలతో ప్రదర్శన ఏర్పాటు చేయనుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అధికారులకు సూచనలిస్తూ, "శిక్షణ పొందిన వారే యోగా దినోత్సవంలో పాల్గొంటారు. యోగాను ఒక ప్రజా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలి. ప్రధాని మోదీకి ఇచ్చిన మాట ప్రకారం యోగా నిర్వహణకు ప్రణాళిక రూపొందించాం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా తప్పనిసరి. అందరం కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం" అని పిలుపునిచ్చారు. 607 వార్డు సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, 326 కంపార్ట్‌మెంట్లలో యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలి... ...ర్కింగ్, మరుగుదొడ్ల వంటి సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి అవసరమైన అన్ని వివరాలను ముందుగానే తెలియజేయాలని, వారు కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళ్లేంత వరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

*** పసుపు నీళ్లలో చొక్కాలు ముంచి ఇచ్చాం!**

సమీక్ష సందర్భంగా 1987లో జరిగిన మహానాడును ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. సరైన వసతులు లేని రోజుల్లో కూడా కళా వెంకట్రావు వంటి నేతల సహకారంతో మహానాడును అద్భుతంగా నిర్వహించామని, ఎంతమంది వస్తారు, ఎంత దూరం నడుస్తారనేది కూడా ముందే అంచనా వేశామని తెలిపారు. హాజరయ్యేవారంతా పసుపు చొక్కాలు ధరించి రావాలని సూచించామని, అలా రానివారి చొక్కాలను పసుపు నీళ్లలో ముంచి ఇచ్చామని నాటి సంఘటనలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నందున ఇలాంటి కార్యక్రమాలను మరింత విజయవంతంగా నిర్వహించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

# చెవిరెడ్డి భాస్కరరెడ్డి అరెస్టు

అమరావతి: వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి కొల్లగొట్టిన సొత్తులో కొంత మొత్తాన్ని గత ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు చేరవేసినట్లు దర్యాప్తులో సిట్ గుర్తించింది. ఈ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన వైకాపా నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని (ఏ38) మంగళవారం అరెస్టుచేసింది. ఈ ముడుపుల సొమ్మును కలెక్షన్ పాయింట్లకు చేరవేయడంలో కీలకపాత్ర పోషించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి బాల్యమిత్రుడు, సన్నిహితుడైన వెంకటేశ్‌నాయుడినీ (ఏ 34) అరెస్టుచేసింది. వీరిద్దరూ బెంగళూరు నుంచి శ్రీలంకకు పారిపోతుండగా విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు మంగళవారం ఉదయం అడ్డుకున్నారు. చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడిపై లుక్ అవుట్ సర్క్యులర్లు ఉండడంతో వారిద్దరినీ అక్కడే నిర్బంధించి ఆ సమాచారాన్ని సిట్ అధికారులకు తెలిపారు. సిట్ బృందాలు బెంగళూరు వెళ్లి, మంగళవారం రాత్రి వారిద్దరినీ అరెస్టు చేశాయి. వీరి అరెస్టుతో మద్యం కుంభకోణంలో అరెస్టయిన నిందితుల సంఖ్య తొమ్మిదికి చేరింది. 'మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి వసూలుచేసిన సొమ్మును రాజ్ కెసిరెడ్డి గతేడాది ఎన్నికలకు 6 నెలల ముందునుంచి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి చేరవేసేవారు. చెవిరెడ్డి తన దగ్గర పనిచేసే కొందరు పీఏలు, గన్‌మెన్, డ్రైవర్లు, అనుచరులు, సన్నిహితులను హైదరాబాద్, బెంగళూరుల్లోని పలు ప్రాంతాలకు పంపించి ఈ ముడుపుల సొత్తును రాజ్ కెసిరెడ్డి బృందం నుంచి సేకరించేవారు. ఇలా దాదాపు రూ.250300 కోట్ల మేర చెవిరెడ్డికి చేరాయి. ఆ మొత్తాన్ని ఆయన తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ సహా అనేక ప్రాంతాల్లో ఏర్పాటుచేసుకున్న కలెక్షన్ పాయింట్ల వద్ద పెట్టుకున్నారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఈ మొత్తాల్ని 5 జిల్లాల్లో వైకాపా అభ్యర్థులకు చేర్చారు. ఆ సొమ్మునే వారు ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీచేశారు'' అని సిట్ దర్యాప్తులో గుర్తించింది. ఈ సొత్తును తరలించడం, దాచడంలో వెంకటేశ్‌నాయుడు కీలకంగా వ్యవహరించినట్లు తేల్చి, ఇద్దరినీ అరెస్టుచేసింది.

*** ఆ రూ.8.30 కోట్లు... మద్యం ముడుపుల సొమ్మే**

గతేడాది ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా మే 9న గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు రూ.8.36 కోట్ల నగదు పట్టుబడింది. ఓ పైపుల లారీ క్యాబిన్‌లో అరలు ఏర్పాటుచేసి అందులో నగదు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. లారీ సిబ్బందిని ప్రశ్నించగా... కొంతమంది హైదరాబాద్‌లో తమకు లారీ అప్పగించి గుంటూరు శివారులో లోడ్ దించాలని చెప్పారని, అంతకుమించి తమకేమీ తెలియదని వెల్లడించారు. తర్వాత ఆ కేసు దర్యాప్తు నీరుగారింది. అదంతా మద్యం లంచమేనని సిట్ తాజా దర్యాప్తులో గుర్తించింది. మద్యం ముడుపుల సొమ్మును రాజ్ కెసిరెడ్డి తొలుత వెంకటేశ్‌నాయుడి వద్దకు చేర్చగా.. ఆయన ఆ మొత్తాన్ని హైదరాబాద్ నుంచి గుంటూరులో చెవిరెడ్డి చెప్పిన చోటుకు తరలించేందుకు ఈ లారీలో పంపినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల నుంచి డబ్బును వెంకటేశ్‌నాయుడు కార్లు, చిన్న చిన్న వాహనాల్లో అనాజ్‌పూర్‌కు తరలించి, అక్కడ లారీలో లోడ్ చేయించినట్లు వెలుగుచూసింది. సాక్షుల విచారణ, సీసీ ఫుటేజీల పరిశీలనలో ఇదంతా వెల్లడైంది.

*** దర్యాప్తు ముమ్మరం కావడంతో ఎదురుదాడి.. దబాయింపు**

మద్యం కేసులో తన పాత్ర బయటపడగానే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సిట్ దర్యాప్తునకు ఆటంకం కలిగించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. చెవిరెడ్డి పీఏలు, గన్‌మెన్, డ్రైవర్లు, ఇతర సన్నిహితులను సిట్ విచారణకు పిలవడంతో ఇక తాను తప్పించుకోలేనని భావించి సిట్‌పై ఎదురుదాడి చేశారు. తనవద్ద గన్‌మన్‌గా పనిచేసిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మదన్‌రెడ్డి, తన అనుచరుడు బాలాజీ యాదవ్‌లతో సిట్ అధికారులపై తప్పుడు ఆరోపణలు చేయించారు. తన పాత్రపై సిట్ అధికారులకు కీలక ఆధారాలు దక్కడంతో ఇక అరెస్టు తప్పదని భావించి.. విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించారు. తనతో పాటు వెంకటేశ్‌నాయుడు, ఆయన కుటుంబసభ్యులనూ తీసుకెళ్లారు. ఈలోగా బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడ్డారు.

# 'ఎక్కడ దాక్కున్నారో తెలుసు.. బేషరతుగా లొంగిపో' సుప్రీం లీడర్‌కు ట్రంప్ హెచ్చరిక

ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమవుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఎక్కడ దాక్కున్నారనే పక్కా సమాచారం తమ వద్ద ఉందన్నారు. ఆయన్ను లక్ష్యంగా చేసుకోవడం చాలా తేలిక అయినప్పటికీ.. ప్రస్తుతానికి ఖమేనీని చంపే ఉద్దేశం తమకు లేదన్నారు. తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్.. బేషరతుగా లొంగిపోవాలని సుప్రీం లీడర్‌కు హెచ్చరికలు జారీచేశారు. ''సుప్రీం లీడర్ ఎక్కడ దాక్కున్నారో మాకు స్పష్టంగా తెలుసు. ఆయన్ను లక్ష్యంగా చేసుకోవడం మాకు చాలా తేలిక. ఆయన సురక్షితంగానే ఉన్నారు. ప్రస్తుతానికి ఆయన్ను తొలగించే (చంపే) ఉద్దేశం మాకు లేదు. అయితే, పౌరులు లేదా అమెరికా సైనికులపై క్షిపణి దాడులు చేయడాన్ని సహించే ప్రసక్తే లేదు. మా సహనం నశిస్తోంది. ఈ విషయంపై దృష్టి సారించినందుకు ధన్యవాదాలు'' అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆ సందర్భంగా సుప్రీం లీడర్ బేషరతుగా లొంగిపోవాలని స్పష్టం



చేశారు. ఇరాన్ గగనతలం మొత్తం తమ నియంత్రణలోనే ఉందని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. స్కై ట్రాకర్లు, గగనతల రక్షణ వ్యవస్థలు ఇరాన్ వద్ద ఉన్నాయని, అయినప్పటికీ వాటిని అమెరికా సాంకేతికతతో పోల్చుకోలేమన్నారు. మరోవైపు ఇరాన్ సైనిక స్థావరాలు, అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తున్న వేళ సుప్రీం లీడర్ ఖమేనీని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వార్తలు వచ్చాయి. ఈశాన్య టెహ్రాన్‌లోని ఓ బంకర్‌లో కుటుంబంతో కలిసి ఆయన తలదాచుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు. మరోవైపు ఇరాన్‌పై చేస్తున్న దాడులను సమర్థించుకున్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. ఇరుదేశాల మధ్య సంఘర్షణను పెంచడం కంటే త్వరగా యుద్ధాన్ని ముగించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఇందుకు ఇరాన్ సుప్రీం లీడర్‌ను హతమారిస్తేనే దీనికి ముగింపు ఉంటుందంటూ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అంతకుముందు ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని చంపేందుకు ఇజ్రాయెల్ పథకం రచించిందని, దీన్ని ట్రంప్ తిరస్కరించారనే వార్తలు కూడా వచ్చాయి.

# చర్చ్ గాగిల్లాపూర్ లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

* కబ్జా చేస్తే కఠిన చర్యలు: ఆర్ఐ రవి కుమార్.:








ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: దుండిగల్ మండలం చర్చ్ గాగిల్లాపూర్ లో ఓ పోలీస్ అధికారికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని భూ కబ్జాదారులు ఆక్రమించగా కబ్జా తతంగాన్ని వెలుగులోకి తెచ్చేలా ప్రజాస్ఫూర్తిలో వచ్చిన కథనానికి రెవిన్యూ అధికారులు స్పందించారు. చర్చ్ గాగిల్లాపూర్ 214 సర్వే నెంబర్ లో ఓ పోలీస్ అధికారికి ప్రభుత్వం 200 గజాల స్థలం కేటాయించగా భూ కబ్జాదారులు ఆ స్థలం ఆక్రమించి మూడు బెస్మెంట్ లను నిర్మించారు. పోలీస్ కుటుంబానికి కేటాయించిన స్థలానికే రక్షణ లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి అని మంగళవారం ప్రజాస్ఫూర్తిలో కథనం ప్రచురించిగా రెవిన్యూ అధికారులు స్పందించారు.ఆర్ ఐ రవి కుమార్ నేతృత్వంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ఈ కార్యక్రమం రెవిన్యూ సిబ్బంది రాజు, శ్రీను, జితేందర్ వున్నారు.ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారైనా సహించేది లేదని ఈ సందర్భంగా ఆర్ఐ పేర్కొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం



జిన్నారం,ప్రజాస్ఫూర్థి 17; జిన్నారం మండలంలోని ఊట్ల గ్రామంలో మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిన్నారం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రతిభ హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేయడం చాలా సంతోషించదగ్గ విషయమని అన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం చేయడం శుభ పరిణామమని, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు విద్యను అభ్యసించే విధానాలు నేర్చుకుంటారని ఆమె తెలిపారు. పిల్లలు మానసికంగా ,శారీరకంగా ఎదుగుదలకు అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాగలక్ష్మి, చిన్నారులు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ.. పట్టుదల.. లక్ష్యానికి మార్గాలు

: ఆరెగూడెం జడ్పీహెచ్ఎస్ సుదర్శన

- డీఈవో సత్యనారాయణ





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి.. క్రమశిక్షణ.. పట్టుదల.. అంకితభావం.. మార్గాలని జిల్లా విద్యాశాఖ అధికారి కే సత్యనారాయణ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈవో సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. లక్ష్య సాధనకు కఠోర శ్రమతో పాటు పట్టుదల, అంకితభావంతో కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన జీవితాన్ని గడపాలన్నారు. స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, మహాత్మా గాంధీ వంటి మహానుభావుల జీవిత చరిత్రలు అధ్యయనం చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులు భవిష్యత్తులో సన్మార్గంలో నడిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు నల్లెంకి శంకరయ్య, ఉపాధ్యాయులు శ్వేత, విజయ్ ప్రతాప్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ

* రాయితీకి ఆదేశాలిచ్చిన డీఈవో కు కృతజ్ఞతలు
* టియూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు దోనూరు రాంరెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ మండలాలలో ఉన్న ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్న స్థానిక వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజులో రాయితీ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టియూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా యూనియన్ పక్షాన డీఈవో ను కోరిన వెంటనే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ఉత్తర్వులను అమలు చేయడం కోసం మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం పట్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రభ చౌటుప్పల్ డివిజన్ స్టాఫ్ రిపోర్టర్ దోనూరు రాంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదేశాలు జారీ చేసిన జిల్లా విద్యాధికారి సత్యనారాయణ కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలలో పాఠ్యపుస్తకాల అమ్మకాలను, ఇష్టానుసారంగా చేస్తున్న ఫీజుల వసూలును అరికట్టాలని, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని, పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎస్ఆర్ విద్యార్థినికి నీట్‌లో 100 వ ర్యాంక్.. డీఐఈఓ అభినందన..



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ ఆర్ కళాశాల విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం డీఐఈఓ దస్రూనాయక్ ఎస్ ఆర్ కళాశాలకు విచ్చేసి జోనల్ ఇన్‌చార్జి దోనాల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విద్యార్థిని ప్రియాంకను సన్మానించారు. అదే విధంగా ఆమె తల్లిదండ్రులను అభినందించారు. ప్రియాంక తోపాటు నల్గొండ బ్రాంచ్ లో మెడిసిన్ ర్యాంక్ సాధించిన పావని, లేఖన, ప్రవల్లిక,జ్యోతి,గాయత్రి,దివ్య ధరణి లను వల్ల తల్లీ దండ్రులను చలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జోనల్ ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డిని ర్యాంక్ సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోశ్‌రెడ్డి, సీఈఓ సురేందర్‌రెడ్డి, నల్లగొండ బ్రాంచ్ అసిస్టెంట్ జోనల్ సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు మనోజ్ రెడ్డి , డీన్ కిషోర్ బాబు, ఏఓ సరితారెడ్డి , అధ్యాపకులు వర్ధన్, ప్రసన్న, శ్రీనివాస్, శోభ విద్యార్థులను.. అభినందించారు.

## గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం ఓఎస్డి నరేందర్ సూచనలతో టేకులపల్లి సిఐ టి.సురేష్ ఆధ్వర్యంలో అళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగారం,పెద్ద వెంకటాపురం గుత్తి కోయ గ్రామాలలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రొగ్రామ్ ను నిర్వహించి అక్కడి ప్రజలతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని,అట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసా కల్పించారు. అలాగే తెలియని వ్యక్తులు తమ తమ గ్రామాలలోకి ప్రవేశిస్తే వారికి ఆశ్రయం కల్పించొద్దని టేకులపల్లి సిఐ సురేష్ సింగారం,వెంకటాపురం గుత్తికోయ గ్రామస్తులకు తెలియజేశారు.ఇటీవల వరుస ఎదురు కాల్పులు,అరెస్టుల వలన అసాంఘీక శక్తులు తమ రక్షణ కోసం చత్తీస్గఢ్ ప్రాంతానికి దగ్గరగా ఉన్న తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున గుర్తు తెలియని వ్యక్తులు,మావోయిస్టు సానుభూతిపరులు మీ గ్రామానికి మీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని,అట్టి సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచి వారికి తగిన నగదు పారితోషకం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని వారికి దూరంగా ఉండాలని తెలియజేశారు. యువత మంచిగా చదువుకొని ప్రభుత్వ ,ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు సంపాదించాలని,క్రీడల్లో రాణించాలని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో ఆళ్లపల్లి ఎస్సై ఎం.సోమేశ్వర్, టిజిఎస్పీ సిబ్బంది , స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసిబి కి అడ్డంగా దొరికిన ఏఈ స్వరూప



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించి ఓ అసిస్టెంట్ ఇంజనీర్ ను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. చర్లపల్లి ఏఈ స్వరూప ఓ కాంట్రాక్టర్ నుంచి లక్ష ఇరవై వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. రామ్ రెడ్డి అనే కాంట్రాక్టర్ తన బిల్లులు చెల్లించడానికి ఏఈ స్వరూప లక్ష ఇరవై వేలు లంచంగా డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్వరూప లంచం కోసం ఒత్తిడి చేయడంతో కాంట్రాక్టర్ రామ్ రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, కాప్రా మున్సిపల్ కార్యాలయంలో ఏఈ స్వరూపను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి లక్ష ఇరవై వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా ఏఈ స్వరూపపై పలు ఆరోపణలు ఉన్నాయి ఏసిబి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఈనెల 19న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక కై కొత్తగూడెం మండలంలో గల సకల పిడి ,పిఈటి లతో మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు .ఈ ఎంపిక కై చేపట్టవలసిన అంశాలు చేయవలసిన కార్యక్రమాల గురించి మండల విద్యాధికారి డాక్టర్ .ప్రభు దయాల్ వివరించారు. అనంతరం విద్యార్థుల ఎంపిక కై చేపట్టు కార్యక్రమాల రూపకల్పన చేశారు. ఈనెల 19న శ్రీ రామచంద్ర స్కూల్ గ్రౌండ్ లో ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలో 4వ తరగతి చదువుతూ క్రీడల్లో ప్రాధాన్యత గల విద్యార్థులను తీసుకొని రావలెనని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

## కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఎల్ బి నగర్ జోనల్ కార్యాలయంలో జడ్ సి హేమంత్ కేశవ్ పాటిల్ నీ మర్యాద పూర్వకంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి చర్లపల్లి డివిజన్ లో పర్యటించినప్పుడు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అలాగే వర్షాకాలాన్నీ దృష్టిలో ఉంచుకొని వివిధ కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన జెడ్ సి త్వరలోనే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ జన్మదిన

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయ ప్రముఖులు, పార్టీ నాయకులు,మహిళా కాంగ్రెస్ నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు,జిల్లా పరిషత్ నాయకులు, బీసీ సెల్ నాయకులు,ఎస్ సి సెల్ నాయకులు, ఎస్ టీ సెల్, మైనారిటీ సెల్ నాయకులు, కౌన్సిలర్స్, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నియోజకవర్గ ప్రజల మధ్య ఆయన చేత కేక్ కట్ చేయించి శాలువాలతో సత్కారించి బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా




రాగమయి కూన శ్రీశైలం గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌరిగే రఘు యాదవ్, కిషన్ యాదవ్, రమేష్, శేఖర్, నాగరాజు, భాస్కర్ లు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరంలో పార్టీ శ్రేణులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వారి రక్తన్ని దానం చేశారు.

## బడ్జెట్ స్కూళ్ల సమస్యలను పరిష్కరించాలి

*** డీఈఓ కు ట్రస్మా ప్రతినిధులు వినతి**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : బడ్జెట్ స్కూళ్ల సమస్యలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల యాజమాన్యాలకు సహకరించాలని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిని ట్రస్మా నేతలు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డీఈఓ విజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రస్మా నూతన కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబులు ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రామేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో బడ్జెట్ పాఠశాలను ఇబ్బందులు పెట్టే విధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇబ్బడి ముబ్బడిగా పాఠశాలలు పుట్టుకొస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపట్ల తల్లిదండ్రులు అప్రమత్తమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా నాయకులు గడ్డమీది బాలరాజు, వినోద్ జాదవ్ పలు పాఠశాలల కరస్పాండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నార్త్‌కు మహర్దశ



మెట్రో రైలు రెండో దశ (బీ) నిర్మాణ ప్రాజెక్ట్‌కు ముందడుగు పడింది. తెలంగాణ సర్కారు రూ.19,579 కోట్లతో 81.6 కిలో మీటర్ల మేర మూడు కారిడార్లకు పరిపాలనా పరమైన అనుమతి ఇచ్చింది. కారిడార్ 9లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ) వరకు 39.6 కిలోమీటర్లు, కారిడార్ 10లో జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కిలో మీటర్లు, కారిడార్ 11లో జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు 22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

**డబుల్ డెక్కర్ పై సందిగ్ధత..**

డబుల్ డెక్కర్ నిర్మాణంపై సందిగ్ధత నెలకొంది. నార్త్ సిటీ మెట్రో ప్రాజెక్ట్ నేపథ్యంలో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల క్రితం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ తరహాలో హైదరాబాద్‌లో డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ (రోడ్డు మార్గం, ఆపైన ఫ్లై ఓవర్, ఆ పైన మెట్రో కారిడార్ ) నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం భావించింది. ముఖ్యంగా కంటోన్మెంట్ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ఇప్పటికే నిర్ణయించిన ఎలివేటెడ్ కారిడార్లను డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్లుగా మార్చాలని సూచించడంతో.. ఆ మేరకు హెచ్ఎండీఏ డిజైన్లను రూపొందించింది. శామీర్‌పేట మార్గంలో 22 కిలో మీటర్లకు గాను 12 కిలో మీటర్ల మేర డబుల్ డెక్కర్, మేడ్చల్ మార్గంలో (5.32 కిలోమీటర్ల) ఎలివేటెడ్ కారిడార్‌లో సుమారు 4 కిలో మీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌ను నిర్మించాలని నిర్ణయించారు. ఎలివేటెడ్ కారిడార్లకు రూ.3,812 కోట్ల వరకు వ్యయం కానుండగా, డబుల్ డెక్కర్ నిర్మాణానికి మరో 40 శాతం వ్యయం అవుతుందని అంచనా వేశారు. అయితే హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) తిరకాసు పెట్టినట్లు తెలిసింది. మెట్రో లైన్‌ను తాము సొంతంగా నిర్మించుకుంటామని స్పష్టంచేసినట్లు సమాచారం. దీంతో హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్, మెట్రో కారిడార్లను ఎవరికి వారు నిర్మించుకుంటారా..? లేదా గతంలో రూపొందించిన డిజైన్ల ప్రకారం డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారా..? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది.

**జాయింట్ వెంచర్‌గా..**

హైదరాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5,874 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.3,524 కోట్లు వెచ్చించేలా ప్రాజెక్ట్‌ను రూపొందించారు. అదేవిధంగా రుణాల ద్వారా రూ.9,398 కోట్లు సేకరించనున్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.783 కోట్లు ఖర్చు చేయనున్నారు. దీనిలో కేంద్ర ప్రభుత్వ వాటా 18 శాతం కాగా, తెలంగాణ ప్రభుత్వ వాటా 30 శాతం, జైకా, ఏడీబీ, ఎన్డీబీ నుంచి రుణం వాటా 48 శాతం, పీపీపీ కాంపోనెంట్ 4 శాతంగా పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పరిపాలన అనుమతితోపాటు డీపీఆర్‌కు జత చేసి కేంద్రానికి పంపనున్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ , స్కాలర్షిప్‌లను తక్షణమే విడుదల చేయాలి

**బీజేవైఎం నాయకులు**




హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు.ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీజేవైఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విద్యా మండలి కార్యాలయం ముందు బీజేపీవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ల మహేందర్ నాయకత్వంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీ కార్పొరేటర్ సామల పవన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సీట్ల భర్తీ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డొనేషన్ పేరుతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటువంటి కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్షిప్‌లు విడుదల కాకపోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఇబ్బందులకు చేయడం సరికాదన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిల్ కౌంటీ లోని "శ్రీ వెంకటేశ్వరదేవస్థానం" నందు ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం ఆ వెంకటేశ్వరుడి కరుణా కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రాజేందర్ రెడ్డి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు భూపాల్ రెడ్డి, అజయ్ సాగి, పరిమళ, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు కాసాని సుధాకర్, గాజుల సుజాత, కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, బిఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబ శివ రెడ్డి, నాయకులు ఆనంద్ రెడ్డి, ప్రదీప్ తాళ్లూరి, మహమ్మద్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట ఎయిర్‌పోర్టుకు శ్రీవారి పేరు: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల: రేణిగుంట ఎయిర్‌పోర్టుకు శ్రీవారి పేరు పెట్టాలని ధర్మకర్తల మండలి ప్రతిపాదించిందని, పేరు మార్పుపై ఏవియేషన్ సంస్థకు లేఖ రాయాలని నిర్ణయించినట్టు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ధర్మకర్తల మండలి అత్యవసర భేటీ ముగిసింది. అనంతరం సమావేశం వివరాలను బీఆర్ నాయుడు మీడియాకు వివరించారు. ''బెంగళూరులో శ్రీవారి ఆలయం నిర్మించాలని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కోరారు. ప్రస్తుతం బెంగళూరులో ఉన్న శ్రీవారి ఆలయం చిన్నగా ఉంది. పెద్ద ఆలయం నిర్మించాలని డీకే కోరారు. స్థలం కేటాయించగానే ఆలయం నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాం. తితిదేకు 100 విద్యుత్ బస్సులు కేటాయిస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చారు. తితిదే ఉచిత ఎలక్ట్రిక్ బస్సుల వల్ల తిరుమలలో భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. తిరుపతిలో సీఎస్ఐఆర్ పెద్ద ల్యాబ్ ఏర్పాటు కానుంది. ల్యాబ్ నిర్మాణానికి స్థలం లీజు పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించాం. ఈ ల్యాబ్ ద్వారా నెయ్యి, నీరు, పప్పుధాన్యాల నాణ్యతను అధికారులు పరిశీలిస్తారు. సమరసత్తా ఫౌండేషన్ సహకారంతో అర్చక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నాం. తితిదేకి చెందిన ఏడు పాఠశాలల్లో దాదాపు 1600 మంది విద్యార్థులకు మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తాం. తితిదే విద్యాసంస్థల్లో విద్యార్థులకు సనాతన ధర్మం, తెలుగు సాంస్కృతిక వైభవంపై శిక్షణ ఇవ్వడానికి మన వారసత్వం పేరుతో కార్యక్రమం చేపడుతున్నాం. వరలక్ష్మీ వ్రతం పర్వదినాన సౌభాగ్యం పేరుతో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి'' అని తితిదే ఛైర్మన్ తెలిపారు. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు ఈ భేటీకి హాజరయ్యారు.

## పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21 న ఘనంగా నిర్వహించనున్నారు. పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నాయి. ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్ యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ గా పేర్కొన్నారు. ఇది వ్యక్తిగత, సామాజిక ఆరోగ్యం, ఐక్యత, ప్రశాంతతకు ప్రాధాన్యత ఇస్తుంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం, అన్ని జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 21 న ఉదయం 6.30 నుండి 7.45 వరకు జరిగే యోగా సంగమ్ అనే దేశవ్యాప్త సామూహిక యోగా ప్రదర్శనలో అన్ని పాఠశాలలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన కామన్ యోగా ప్రోటోకాల్ ను పాటించాలని పేర్కొన్నారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ మావురాల ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కళ్యాణ మహోత్సవం



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ జీడిమెట్ల డిపో వద్ద గల శ్రీశ్రీశ్రీ మావురాల ఎల్లమ్మ దేవాలయంలో శివ హనుమాన్ స్యాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి కళ్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, మావురాల ఎల్లమ్మ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ ప్రవేశాల్లో అక్రమాలు, అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఇంజినీరింగ్ ప్రవేశాల్లో అక్రమాలు, అనుమతులు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే గుండ్ల కార్తీక్ టీఎస్సీహెచ్ఈ ఛైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో జరుగుతున్న అక్రమాలు, అనుమతులు లేకుండా నడుస్తున్న కాలేజీల అంశాలను చర్చించారు. ప్రత్యేకంగా బీ కేటగిరీ సీట్ల మేనేజ్‌మెంట్ ద్వారా అక్రమంగా అమ్మకాలు, మెరిట్‌కు వ్యతిరేకంగా డొనేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పించడం వంటి అంశాలను వివరంగా తెలియజేశారు. విద్యార్థులు , తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై కర్తవ్యతతో స్పందించిన ఛైర్మన్, త్వరలోనే విధివిధానాలు రూపొందించి బి కేటగిరీ ప్రవేశాల్లో పారదర్శకత తీసుకురావడం జరిగేలా చూస్తామన్నారు.అనుమతులు లేకుండా నడుస్తున్న సంస్థలపై కూడా కార్తీక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, ఛైర్మన్ దీనిపై తక్షణమే విచారణ చేసి, అవసరమైతే సంస్థను మూసివేస్తామంటూ స్పష్టమైన హామీ ఇచ్చారు.కార్తీక్ మాట్లాడుతూ విద్య అనేది ఒక హక్కు. డబ్బు ఉన్నవారికే ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి అని పేర్కొన్నారు.

## గురుకులాల్లో సీట్లు.. తల్లిదండ్రులకు తప్పని పాట్లు



సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో సీట్ల కోసం బాగా డిమాండ్ బాగా పెరిగింది. ఇంగ్లీష్ మీడియం బోధన, నాణ్యమైన విద్య, ఇతర సౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు గురుకులాల్లో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు రెసిడెన్షియల్ స్కూళ్లలో సీట్లకు ప్రాముఖ్యత ఏర్పడింది. ముఖ్యంగా 5, 6, 7,8వ తరగతులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 268 ఇనిస్టిటూషన్స్ కొనసాగుతున్నాయి. అందులో బాలురుకు సంబంధించి 93 స్కూళ్లు, జూనియర్ కాలేజీలు, అలాగే బాలికలకు 145 స్కూళ్లు, జూనియర్ కాలేజీలు, 30 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ప్రస్తుతానికి లక్షలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రస్తుతానికి 5వ తరగతిలో సీటు కోసం తీవ్ర పోటీ నెలకొంది. మరికొందరు ఆపై తరగతులతో పాటు ఒకచోట నుంచి మరోచోటుకు బదిలీ కోసం ప్రయత్నిస్తున్నారు.

# టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపణలు చేయడంతో కేటీఆర్ ఈ నోటీసులు పంపినట్లు



సమాచారం.మహేశ్‌కుమార్‌గౌడ్ ఏమన్నారంటే?..

''టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ మా ఫోన్లను ట్యాప్ చేశారు. రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య. ఈ చర్యకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలదించుకోవాలి. రాజకీయాల్లో భారాస నేతలే ఉండాలనే దురుద్దేశంతో మా ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ల ట్యాపింగే కారణమని తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇదే ఫిర్యాదును గతంలోనూ చేశాను. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయి. చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లను ట్యాప్ చేశారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయి.సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిసింది'' అని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు.

## చత్తీస్‌గఢ్‌లో దారుణం.. ముగ్గురిని హతమార్చిన మావోయిస్టులు



చర్ల: చత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. ఒకే గ్రామంలో ముగ్గురిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన జిల్లాలోని పెద్దకోర్మ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. లొంగిపోయిన మావోయిస్టు సభ్యుడు దినేశ్ మొడియం కుటుంబానికి చెందిన ముగ్గురిని మావోయిస్టులు దారుణంగా హత్య చేశారు. మృతులు జింగు మొడియం, సోమ మోడియం, అనిల్ మద్వి అని తెలుస్తోంది. హత్య చేసిన అనంతరం మావోయిస్టులు గ్రామంలో హల్‌చల్ చేశారు. గ్రామంలో ఏడుగురిపై దాడి చేశారు. మరో 12 మందిని కిడ్నాప్ చేశారు. ఈ ఘటనపై ఆరా తీస్తున్నట్లు ఎఎస్పీ చంద్ర కాంత్ గవర్న తెలిపారు.

## త్వరలో రూ.1,800కోట్లతో ఉపాధి హామీ పనులు: మంత్రి సీతక్క

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా త్వరలో ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామాణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఉపాధి హామీ కింద రూ. 1,800కోట్ల పనులు మంజూరు చేశామని, ఈ సారి అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. తన శాఖలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, ఇతర పెండింగ్ అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది మండలానికి రెండు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 1440



పంచాయతీ కార్యాలయాలు, మరో 1400 అంగన్వాడీ భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ఎంపీడీవోల బదిలీలు, వాహనాల అలవెన్స్‌లకు సంబంధించిన ఫైళ్లకు రెండ్రోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో విధానాన్ని అధ్యయనం చేసేందుకు అధికారుల్ని పంపించనున్నట్లు తెలిపారు. భవనాల నిర్మాణాల కోసం 15 రోజుల్లో టెండర్లు వేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, డైరెక్టర్ సృజన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వేధింపులు భరించలేక కన్న తండ్రిని కడతేర్చిన కుమార్తె

బోధన్: తల్లి, అక్కను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఓ యువతి.. కన్న తండ్రిని హత్య చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా నవిపేట్ మండలం ధర్మారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నర్సయ్య (54)కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పెళ్లి అయి విడాకులు తీసుకుని పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో నర్సయ్య.. తన భార్య, పెద్ద కుమార్తెతో తరచూ గొడవ పెట్టుకోవడమే కాకుండా శారీరకంగా హింసించేవాడు. మంగళవారం కూడా నర్సయ్య గొడవ పడటంతో తల్లికుమార్తెలిద్దరూ ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన చిన్న కుమార్తెతో నర్సయ్య అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విసిగిపోయిన ఆమె రోకలి బండతో తండ్రి తలపై మోది హత్య చేసింది. సమీప బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆమెను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## హైదరాబాద్ నుంచి ఇథియోపియా దేశానికి విమాన సర్వీసు ప్రారంభం

హైదరాబాద్: హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు నేరుగా మొట్టమొదటిసారి విమాన సర్వీసు ప్రారంభమైంది. శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాకు నాన్‌స్టాప్ సేవలను ప్రారంభించారు. దీంతో హైదరాబాద్ గ్లోబల్ కనెక్టివిటీ మరింత బలపడింది. ఈ సేవలను ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ సంస్థ నిర్వహిస్తోంది. అడ్డిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు సోమ, బుధ, శుక్రవారాల్లో.. హైదరాబాద్ నుంచి అడ్డిస్ అబాబాకు మంగళ, గురు, శనివారాల్లో సర్వీసులు నడపనున్నారు. ఈ విమాన సర్వీసుతో అడ్డిస్ ఇథియోపియాతో భారత వ్యాపార, పర్యాటక ప్రయాణికులకు మరింత



అనుకూలత లభించనుంది. మరోవైపు భారత్‌లో వైద్యం చేయించుకునేందుకు ఆఫ్రికాలోని ఇథియోపియా, నైజీరియా, టాంజానియా, ఉగాండా, రువాండా, జాంబియా, కేమరూన్, కెన్యా దేశాల నుంచి అనేక మంది రోగులు వస్తుంటారు. అలాంటి వారికి ఈ విమాన సర్వీసు ఉపయుక్తంగా ఉండనుంది.

## తెలంగాణలో టెట్ పరీక్షకు 66 కేంద్రాలు

హైదరాబాద్: తెలంగాణలో ఈనెల 18 నుంచి 30 వరకు నిర్వహించనున్న టెట్ పరీక్షకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా టెట్ కోసం 66 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్ణీత తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు సెషన్ 1; మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి. జూన్ 18, 19, 24 (మొదటి షిఫ్టు), 28, 29, 30 తేదీల్లో పేపర్ 2 పరీక్షలు జరగనుండగా.. జూన్ 20, 23, 24 (రెండో షిఫ్టు), 27 తేదీల్లో పేపర్ 1 పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 30



వరకు టెట్‌కు దరఖాస్తులు ఆహ్వానించగా 1.83లక్షల దరఖాస్తులు వచ్చాయి. పేపర్ 1కు 63,261మంది, పేపర్ 2కు 1,20,392మంది దరఖాస్తు చేసుకోగా.. రెండు పేపర్లకు దరఖాస్తు చేసినవారు 15వేల మంది వరకు ఉన్నట్లు అధికారులు

### 600 మంది ఫోన్లు ట్యాప్..

## బాధితుల్లో జర్నలిస్టులు, సినీ, రాజకీయ ప్రముఖులు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. 2023 ఎన్నికలకు రెండు నెలల ముందు అధిక సంఖ్యలో ఫోన్లు ట్యాప్ చేసినట్టు సిట్ గుర్తించింది. ఇప్పటి వరకు దాదాపు 600 మందికి పైగా ఫోన్లు ట్యాప్ అయ్యాయని అధికారుల దర్యాప్తులో తేలింది. బాధితుల్లో జర్నలిస్టులు, సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ బాధితులు ఒక్కొక్కరుగా జూబ్లీహిల్స్ పీఎస్‌కు వచ్చి వాంగ్మూలం ఇస్తున్నారు. బాధితులు చెప్పిన వివరాల మేరకు ప్రభాకర్‌రావుతో పాటు నలుగురు నిందితులను కూడా కలిపి విచారించాలని సిట్ భావిస్తోంది. ప్రతి రోజు ఉదయం 2గంటల పాటు ప్రభాకర్‌రావు తమకు బ్రీఫింగ్ ఇచ్చే వారని నలుగురు నిందితులు సిట్ అధికారులకు తెలిపారు.



పోల్ 2023 వాట్సాప్ గ్రూప్‌పై ప్రధానంగా ప్రభాకర్ రావును సిట్ ప్రశ్నించనుంది. అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సన్నిహితులు గాలి అనిల్, వినయ్ రెడ్డిల ఫోన్‌లు ట్యాప్ చేసి స్వాధీనం చేసుకున్న డబ్బుపై కూడా సిట్ ఆరా తీసింది. పొంగులేటి, రాజగోపాల్ రెడ్డికి చెందిన కంపెనీల డబ్బును ఫోన్లు ట్యాప్ చేసి టాస్క్ ఫోర్స్ ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు గుర్తించారు. 2023 ఎన్నికల సమయంలో ట్యాపింగ్ బాధితుల్లో భారాస నేతలు కూడా ఉన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారి ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ ఇప్పటికే ఆధారాలు సేకరించింది.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాకు కాస్త సమయం ఇవ్వాలి: ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తమకు కాస్త సమయం కేటాయించాలని గోషామహల్ భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగతంగా కలిసి సమస్యలు చెప్పాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడ, ఎప్పుడు అనేది నిర్ణయిస్తే అప్పుడు వచ్చి కలిసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రాష్ట్రానికి భాజపా ప్రభుత్వం అవసరమని, వ్యక్తి గత విభేధాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేద్దామని పేర్కొన్నారు. తనను అధిష్ఠానం సస్పెండ్ చేస్తే అందరి జాతకాలు బయటపెడతానంటూ ఇటీవల రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''తెలంగాణలో భాజపా ప్రభుత్వం రావాలంటే పాత సామాను పార్టీ నుంచి బయటికెళ్లిపోవాలి. కొందరు భాజపా నేతలు తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే వాళ్లతో రహస్యంగా సమావేశమవుతున్నారు. రహస్య సమావేశాలు పెట్టుకుంటే రాష్ట్రంలో మన ప్రభుత్వం వస్తుందా? జాతీయ నాయకత్వం కూడా ఆలోచన చేయాలి. గొప్పలు చెప్పుకొనే వాళ్లకు రిటైర్‌మెంట్ ఇస్తేనే పార్టీకి మంచి రోజులు. నేనొక్కణ్నే కాదు.. ప్రతి భాజపా నాయకుడు, కార్యకర్తలు ఇదే కోరుకుంటున్నారు'' అని రాజాసింగ్ గతంలో సొంత పార్టీ నేతలపైనే విమర్శలు చేశారు. తాజాగా ఆయన చేసిన ప్రకటన చర్చనీయాంశంగా మారింది.

## కానిస్టేబుల్ మదన్‌రెడ్డి అధికారులనే బెదిరించాడు: సిట్

విజయవాడ: చెవిరెడ్డి వ్యక్తిగత గన్‌మెన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్‌రెడ్డి ఆరోపణలను సిట్ అధికారులు ఖండించారు. మద్యం కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు సిట్ తెలిపింది. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి సిట్ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ''కెసిరెడ్డి నుంచి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి భారీగా ముడుపులు అందినట్టు తేలింది. ఈ నగదును ఎన్నికల వేళ ప్రజలకు పంచినట్టు తెలిసింది. చెవిరెడ్డి వ్యక్తిగత గన్‌మెన్ మదన్‌రెడ్డిని విచారణకు పిలిచాం. అతను విచారణకు సహకరించలేదు. మదన్‌రెడ్డి




మా అధికారులను బెదిరించాడు. మా పేర్లు రాసి చనిపోతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. మద్యం స్కామ్‌ను పారదర్శకంగా, నిబద్ధతతో విచారిస్తున్నాం. ఇప్పటి వరకు 200మందికి నోటీసులిచ్చి విచారించాం. ఇప్పటి వరకు ఎవరూ ఎటువంటి ఆరోపణలు చేయలేదు. కానిస్టేబుల్ మదన్‌రెడ్డి డ్రామాలను కొన్ని ఛానెళ్లు వైరల్ చేశాయి. చెవిరెడ్డి అనుచరుడు బాలాజీని నిర్బంధించామని ఆరోపిస్తున్నారు.. అది పచ్చి అబద్ధం. మాపై ఒత్తిడి తెచ్చి బలహీనపరచాలనే కుట్ర జరుగుతోంది. మద్యం స్కామ్‌లో దోషులు ఎంతటివారైనా చట్టం ముందు నిలబెడతాం'' సిట్ తెలిపింది.

# విమానం ఆలస్యంపై ఎంపీ అసహనం.. స్పందించిన రామ్మోహన్ నాయుడు

దిల్లీ నుంచి పుణె వెళ్తున్న ఎయిరిండియా విమానం మూడు గంటలకు పైగా ఆలస్యం కావడంపై ఎంపీ సుప్రియా సూలే అసహనం వ్యక్తంచేశారు. ప్రయాణికులకు కనీసం సమాచారం ఇవ్వలేదని తప్పుబట్టారు. ఆమె పోస్ట్‌పై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా స్పందించారు. ''దిల్లీ నుంచి పుణె వెళ్తున్న ఎయిరిండియా విమానం AI 2971లో నేను ప్రయాణించాల్సి ఉంది. విమానం మూడు గంటలకు




పైగా ఆలస్యమయింది. దీనిపై ప్రయాణికులకు ఎటువంటి సమాచారం లేదు. ఇలాంటి ఆలస్యాలు, సేవా లోపాలు ఎయిరిండియాలో సర్వసాధారణంగా మారాయి'' అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును, టాటా గ్రూప్‌ను ఆమె ట్యాగ్ చేశారు. ప్రయాణిలకు మెరుగైన సేవలందేలా చూడాలని పోస్ట్ చేశారు. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. సంబంధిత విమాన సంస్థతో పాటు విమానాశ్రయ అధికారులతో స్వయంగా మాట్లాడానన్నారు. ప్రయాణికులకు తగిన సాయం అందించాలని సూచించినట్లు ఎక్స్ వేదికగా బదులిచ్చారు. మంత్రి రామ్మోహన్ నాయుడు పోస్టుపై ఎయిరిండియా కూడా స్పందించింది. ఆలస్యం వల్ల ఇబ్బందికి గురైన ప్రయాణికులందరికీ తమ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులకు ఎదురైన ఈ అవాంతరానికి చింతిస్తున్నామని




## విమానాల నిర్వహణపై దృష్టి పెట్టండి.. ఎయిరిండియాకు డీజీసీఏ ఆదేశం

దిల్లీ: అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాద ఘటనతో పాటు ఎయిరిండియా విమానాల్లో తరచూ సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో పౌర విమానయాన శాఖ చర్యలకు ఉపక్రమించింది. విమానాల నిర్వహణ, భద్రతపై దృష్టి పెట్టాలని సంస్థ ఉన్నతాధికారులను ఆదేశించింది. అంతేకాకుండా చర్యలను కఠినతరం చేయాలని సూచించింది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఎయిరిండియా 171 విమానం కూలిపోయిన నేపథ్యంలో ఆ సంస్థ సీఈవోను క్యాంప్‌బెల్ విల్సన్‌తో డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సమావేశమయ్యారు. విమానాల భద్రత, నిర్వహణపై దృష్టి సారించాలని కోరారు. విమాన కార్యకలాపాలను కఠినతరం చేయాలని, సకాలంలో బయలుదేరేలా చూడాలని ఎయిరిండియాను కోరింది. తాజాగా అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన మరో ఎయిరిండియా విమానంలోనూ సాంకేతిక సమస్య ఎదురైన సంగతి తెలిసిందే. టేకాఫ్‌కు ముందే సమస్యను గుర్తించడంతో సర్వీసును రద్దు చేశారు. డీజీసీఏ సమావేశంలో ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది.

## కార్మిక సంక్షేమ పథకాలతో 50 లక్షల మందికి పైగా లబ్ధి

దిల్లీ: కేంద్రం అందిస్తున్న కార్మిక సంక్షేమ పథకాల ద్వారా 50 లక్షల మందికి పైగా అసంఘటితరంగ కార్మికులు లబ్ధి పొందారని కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ వెల్లడించింది. ముఖ్యంగా బీడి, సినిమా, గనుల రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందారని ఓ ప్రకటనలో పేర్కొంది. కార్మిక సంక్షేమ సంస్థ (ఎల్‌డబ్ల్యూఓ) దేశవ్యాప్తంగా 18 ప్రాంతీయ సంక్షేమ కమిషనర్ల నేతృత్వంలో ఈ పథకాలను అమలు చేస్తోంది. ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్ఓ), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) వంటి పథకాలకు దూరంగా ఉన్న కార్మికుల కోసం ఈ పథకాలను అమలు చేస్తోంది. మోదీ సర్కార్ 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను కేంద్రం విడుదల చేసింది. సామాజిక భద్రత, ఆరోగ్య సేవలు, విద్యకోసం ఆర్థిక సాయం, వసతి గృహ కల్పన ఈ పథకాల ప్రధాన లక్ష్యమని కార్మిక శాఖ పేర్కొంది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో



ఉండే కార్మికులకు ఈ పథకాలు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపింది. వీటిలో విద్యా సహాయ పథకం ప్రధానమైనది. దీని ద్వారా కార్మికుల పిల్లలకు ఏటా రూ.1000 నుంచి రూ.25 వేల వరకు స్కాలర్‌షిప్ అందుతోందని, నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఈ పథకం అమలవుతోందని తెలిపింది. ఏటా లక్షకు పైగా దరఖాస్తులు వస్తున్నాయని, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతున్నాయని పేర్కొంది. ఆరోగ్య పథకం కింద దేశవ్యాప్తంగా డిస్పెన్సరీల ద్వారా అవుట్‌పేషెంట్ సేవలు అందించడంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు, మూత్రపిండాల మార్పిడి, క్యాన్సర్, క్షయవ్యాధి, చిన్న చిన్న శస్త్రచికిత్సలు వంటి వాటికి రీఎంబర్స్‌మెంట్ కూడా లభిస్తోంది. మైనర్ సర్జరీలకు రూ.30 వేల వరకు, అలాగే క్యాన్సర్ చికిత్సకు గరిష్ఠంగా రూ.7.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందుతోంది. 2016లో ప్రారంభమైన సమగ్ర గృహ పథకాన్ని ఇప్పుడు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో విలీనం చేశారు. 2024 మార్చి 31 వరకు ఉన్న బకాయిలను అర్హులైన లబ్ధిదారులకు చెల్లించామని మంత్రిత్వశాఖ తెలిపింది.

## అప్పుడు వారు రాజీనామా చేయలేదేం?

**: సిద్ధరామయ్య కౌంటర్**

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవం వేళ జరిగిన తొక్కిసలాట లో 11 మంది మృతికి బాధ్యత వహిస్తూ కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రులు రాజీనామా చేయాలన్న భాజపా నేతల డిమాండ్‌పై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఘాటుగా స్పందించారు. తనను రాజీనామా అడిగే ముందు భాజపా పాలిత రాష్ట్రాల్లో పలుచోట్ల గతంలో జరిగిన విషాదాలకు బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేసిన భాజపా నేతల జాబితాను విడుదల చేయాలన్నారు. ఈ మేరకు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ''గుజరాత్‌లోని మోర్బిలో ఓ వంతెన కూలి అనేకమంది మృతి చెందారు. ఈ ఏడాది జరిగిన మహా కుంభమేళాలోనూ 30మంది



యాత్రికులు మృతి చెందారు. ఆయా విషాద ఘటనల సమయంలో భాజపా పాలిత రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేయలేదు సరికదా.. దర్యాప్తు కూడా తగిన విధంగా చేపట్టలేదు'' అని ఆక్షేపించారు. అందువల్ల ఇప్పుడు తనని ప్రశ్నించేందుకు భాజపా నేతలకు ఏం నైతికత ఉందని నిలదీశారు. ''దేశంలోని పలుచోట్ల విమాన ప్రమాదాలు, రైల్వే విషాదాల్లో చాలా మంది మరణించారు. గత కొన్నేళ్లుగా మణిపుర్ మండుతూనే ఉంది. రోజూ అక్కడ ప్రజలు చనిపోతున్నారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో వంతెనలు కూలిపోవడంతో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. మరి ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ భాజపా రాజీనామా చేసిందా? ఇది నేను సాకుగా చూపి చెప్పడం కాదు. ఇదంతా వాస్తవం. మనుషుల ప్రాణాలు, బాధలతో రాజకీయాలు చేయడం తగదని భాజపా నేతలు గ్రహించాలి'' అన్నారు. కర్ణాటకలోని తమ ప్రభుత్వం ఏడు కోట్ల మంది కన్నడిగులకు జవాబుదారీగా ఉంటుందని సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఈ తొక్కిసలాట ఘటనలో బాధ్యులైన వారిపై ప్రాథమిక ఆధారాలను బట్టి చర్యలు తీసుకున్నామన్నారు. జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. కఠిన చర్యలకు

## 53వేల ఉద్యోగాలు.. ఎస్ఎస్‌సీ (జీడీ) కానిస్టేబుల్ ఫలితాలు వచ్చేశాయ్




లక్షలాది మంది ఉత్కంఠతో ఎదురు చూస్తున్న ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ (జీడీ) పరీక్ష ఫలితాలు వచ్చేశాయి. కేంద్ర సాయుధ బలగాలు, ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్స్ విభాగాల్లో దాదాపు 53,690 కానిస్టేబుల్ (జీడీ) పోస్టుల భర్తీకి నిర్వహించిన సీబీటీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ)/ ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ) పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాలను ఎస్ ఎస్‌సీ అధికారులు విడుదల చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా జాబితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అలాగే, అభ్యర్థుల కటాఫ్ మార్కులను సైతం పీడీఎఫ్ రూపంలో పొందొచ్చు. విత్‌హెల్డ్ చేసిన అభ్యర్థులు, డీబార్ అయిన అభ్యర్థుల జాబితాలను సైతం వెబ్‌సైట్‌లో ఉంచారు. కేంద్ర సాయుధ బలగాలు (సీఏపీఎఫ్), ఎస్ఎస్ఎఫ్(సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్), అస్సాం రైఫిల్స్‌లో రైఫిల్ మ్యాన్ (జీడీ), నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోలో సిపాయి పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 4 నుంచి 25 వరకు వివిధ తేదీల్లో దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించగా.. 25,21,839మంది అభ్యర్థులు హాజరయ్యారు. మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు కీపై అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తాజాగా ఫలితాలు విడుదుల చేశారు.

## అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే మార్గాలు.. 'నో ఫ్లైయింగ్ జోన్'గా..!

శ్రీనగర్: మంచు లింగాన్ని దర్శించుకోవడానికి ఏటా వేల మంది యాత్రికులు అమర్‌నాథ్ యాత్రకు వెళ్తారు. ఈ ఏడాది కూడా మరికొద్ది రోజుల్లో ఈ వార్షిక యాత్ర ప్రారంభం కానుంది. అయితే, ఇటీవల పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఈ యాత్రకు భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగానే.. అమర్‌నాథ్ యాత్ర వెళ్లే అన్ని మార్గాలను 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించింది. ఈ మేరకు జమ్మూకశ్మీర్ హోం శాఖ మంగళవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సాధారణంగా అమర్‌నాథ్ యాత్రకు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా యాత్రికులు వెళ్తుంటారు. ఈ రెండు మార్గాలను 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటించారు.

## ''హమ్మయ్య.. బతికిపోయా''.. ప్రేమికుడితో భార్య వెళ్లిపోవడంపై ఓ భర్త

మేఘాలయలో అనూహ్య మలుపులు తిరిగిన నవ వధూవరులు అదృశ్యమైన కేసులో వధువే పథకం ప్రకారం భర్తను హత్య చేయించినట్లు వెల్లడైన సంగతి తెలిసిందే. అయితే, ఇదే కేసును ప్రస్తావించిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కొత్తగా పెళ్లైన ఓ యువకుడు.. తాను మరో 'రాజా రఘువంశీ'గా మారకపోవడంతో ఊపిరి పీల్చుకున్నానని చెప్పాడు. పెళ్లైన పది రోజులకే ప్రియుడితో తన భార్య వెళ్లిపోయిందన్నాడు. హనీమూన్ ప్లాన్ చేసుకున్న తాను బతికి బయటపడటం ఊరట కలిగించే విషయమని చెప్పడం గమనార్హం. యూపీలోని బదౌన్‌కు చెందిన సునీల్‌కు ఓ యువతితో మే 17న వివాహం జరిగింది. అనంతరం అత్తగారింటికి వెళ్లిన నవ వధువు అక్కడే తొమ్మిది రోజులపాటు గడిపింది. అనంతరం సంప్రదాయం ప్రకారం పుట్టింటికి వచ్చిన ఆమె.. ఓ రోజు ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో తన భార్య కనిపించడం లేదని స్థానిక పోలీసులకు సునీల్ ఫిర్యాదు చేశాడు. ఆమె కోసం గాలిస్తున్న సమయంలోనే నవవధువు పోలీసుల ముందు ప్రత్యక్షమైంది. తన ప్రియుడితో కలిసి వెళ్లిపోయానని అంగీకరించిన ఆమె.. అతడితోనే తన తదుపరి జీవితం అని స్పష్టం చేసింది. ఈ విషయం తెలుసుకున్న సునీల్ ఆమె ఇష్టాన్ని అంగీకరించాడు.

*** హనీమూన్ కోసం ప్లాన్ చేశా..**

''పుట్టింటినుంచి వచ్చిన తర్వాత హనీమూన్ కోసం నైనిటాల్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నా. కానీ, ఇప్పుడు ఆమె ప్రియుడితో వెళ్లిపోయింది. అయినప్పటికీ.. నేను మరో రాజా రఘువంశీ కానందుకు సంతోషిస్తున్నా. వాళ్లిద్దరూ సంతోషంగా ఉండటంతో పాటు నేను కూడా బతికిపోయా'' అని సునీల్ పేర్కొన్నాడు. ఈ విషయంలో ఇరు కుటుంబాలు కూడా పరస్పర అంగీకారానికి రావడంతో కేసు సుఖాంతం అయ్యింది. అయితే,



పెళ్లి సమయంలో ఇచ్చిన నగలు, ఇతర వస్తువులను వధువు కుటుంబీకులు వరుడికి ఇచ్చినట్లు తెలిసింది. ఇరు కుటుంబాలు ఒప్పందం చేసుకోవడంతో తదుపరి ఎటువంటి చర్యలు లేకుండా కేసును ముగిస్తున్నట్లు స్థానిక పోలీసులు కూడా వెల్లడించారు.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..

## 212 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. మార్కెట్‌లో ఐటీ మినహా ఇతర సూచీలు నష్టాల్లో కొనసాగాయి. ఫలితంగా మార్కెట్లు పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,869.47 స్వల్ప లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో 81,890.15 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,427.01 పాయింట్లకు పడిపోయింది.

చివరకు 212.85 పాయింట్లు పతనమై.. 81,583.30 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 93.10 పాయింట్లు దిగజారి.. 24,853.40 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,443 షేర్లు లాభపడ్డాయి. 2,384 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, ఎటర్నల్, ఓఎన్‌జీసీ నష్టపోగా.. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, మారుతి సుజుకీ లాభాల్లో కొనసాగాయి. ఐటీ మినహా, ఫార్మా, మెటల్, ఆయిల్, గ్యాస్, ఆటో, రియాలిటీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.5-2 శాతం పతనమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి.

## ఆర్బీఐ డెడ్‌లైన్‌కు ముందే.. ఏటీఎంలలో పెరిగిన రూ.100, రూ.200 నోట్ల లభ్యత



**న్యూఢిల్లీ:** ఏటీఎమ్‌లలో రూ.100, రూ.200 నోట్ల లభ్యత పెరిగింది. ప్రజలకు రూ.100, రూ.200 నోట్లు మరింత అందుబాటులో ఉండేలా ఏటీఎమ్‌లలో ఆయా డినామినేషన్ నోట్ల లభ్యతను పెంచాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలే ఆదేశించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 30 నాటికి ఈ నోట్ల లభ్యత పెంచాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది.

దశల వారీగా ఈ ఆదేశాలను అమలు చేయాలని బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎమ్ ఆపరేటర్లకు సూచించింది. ఈ మేరకు 2025 సెప్టెంబర్ 30 నాటికి 75 శాతం ఏటీఎమ్‌లలో కనీసం ఒక్క క్యాసెట్‌లోనైనా రూ.100 లేదా రూ.200 నోట్లు ఉండేలా చూడాలని డెడ్‌లైన్ పెట్టింది. అంతేకాదు 2026 మార్చి 31 నాటికి దీన్ని 90 శాతం పెంచాలని పేర్కొంది. ఆర్బీఐ ఆదేశాలకు అనుగుణంగా డెడ్‌లైన్‌కు ముందే రూ.100, రూ.200 నోట్ల లభ్యత 70 శాతానికిపైగా పెరగడం విశేషం. గతేడాది డిసెంబర్‌లో 65 శాతంగా ఉన్న ఈ నోట్ల లభ్యత ప్రస్తుతం 73 శాతానికి చేరింది. దేశంలోనే అతిపెద్ద నగదు నిర్వహణ సంస్థ అయిన సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. ఈ సంస్థ దేశంలోని మొత్తం 2,15,000 ఏటీఎమ్‌లలో 73,000 ఏటీఎమ్‌లను నిర్వహిస్తోంది.

## మార్కెట్‌కు ఎలక్ట్రిక్ కిక్.. మరో ఈవీ స్కూటర్‌ను రిలీజ్ చేయనున్న హీరో



**న్యూఢిల్లీ:** హీరో మోటోకార్ప్ తాజాగా విడా సిరీస్‌ను అప్‌డేట్ చేస్తూ వీఎక్స్-2 పేరుతో త్వరలో మరో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. జూలై 1న విడా శ్రేణిలోని కొత్త ఈవీను లాంచ్ చేయనుందని నిపుణులు అంచనాలు వేస్తున్నారు. ఇప్పటికే ఈ స్కూటర్‌లోని కొన్ని భాగాలను టీజ్ చేస్తూ ఓ వీడియో రిలీజ్ చేసింది. ఈ కొత్త వీఎక్స్2 మోడల్‌ను ఇప్పటికే ఉన్న వీ2 లైనప్‌తో పోలిస్తే సరికొత్త డిజైన్‌తో వస్తుంది. రిలీజ్‌కు ముందు ముందు విడా వీఎక్స్2 ఈవీ లవర్స్‌ను ఆకట్టుకుంటుంది.

తాజాగా లీక్ అయిన చిత్రాల ప్రకారం ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ వీ2 వెర్షన్‌కు సమానమైన డిజైన్‌తో వస్తుంది. అలాగే హెడ్‌లైట్, టెయిల్ లాంప్‌లలో కూడా పెద్దగా తేడాలు లేవు. అంతేకాకుండా ఈ ఈవీ వీ2 సిరీస్‌ను గుర్తుకు తెచ్చే ఫోల్డెడ్ బాడీతో వస్తుంది. విడా వీక్స్2 యూనిట్ టీఎఫ్‌టీ డిస్ప్లేతో ఆకట్టుకుంటుంది. అయితే వీ2 వెర్షన్‌లో కనిపించే వాటితో పోలిస్తే చాలా చిన్నదిగా ఉంటుంది. అదనంగా స్క్రీన్‌పై ప్రదర్శించే ఎంపికల ద్వారా నావిగేట్ చేయడానికి భౌతిక బటన్‌లను కలిగి ఉంది. ఈ ఎలక్ట్రిక్ వాహనంలోని స్విచ్‌గేర్ కూడా వీ2 నుంచి ప్రేరణగా తీసుకుని డిజైన్ చేసినట్లు అనిపిస్తుంది. ఈ యూనిట్‌లో కీహోల్ కూడా ఉంది.

వివిధ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా విడా వీఎక్స్2 విభిన్న బ్యాటరీ ప్యాక్ ఎంపికలతో వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ గురించి వివరణాత్మక సమాచారం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. దాని స్పెసిఫికేషన్లకు అదనంగా బడ్జెట్-స్నేహపూర్వక వాహనాలను ఉత్పత్తి చేసే లక్ష్యంతో కొత్త ప్లాట్‌ఫామ్‌పై ఎలక్ట్రిక్ స్కూటర్ నిర్మించబడుతుందని భావిస్తున్నారు. రాబోయే మోడల్ ధర ఇంకా ప్రకటించకపోయినా దీని ధర రూ. 74,000 (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమై రూ. 1,20,300 (ఎక్స్-షోరూమ్) వరకు ఉంటుందని నిపుణుల అంచనా వేస్తున్నారు.



# 4 రోజుల టెస్టుకు ఐసీసీ రెడీ..

## 3 దేశాలకు మినహాయింపు !

ముంబై: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే 2027-29 సిరీస్ కోసం ఐసీసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చిన్న దేశాలకు టెస్టు మ్యాచ్‌లను నాలుగు రోజులే నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఐసీసీ తీసుకున్నట్లు ఓ నివేదిక ద్వారా తెలుస్తోంది. అయితే ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లకు ఆ మినహాయింపు ఇచ్చినట్లు కూడా రిపోర్టులో వెల్లడించారు. లార్డ్స్‌లో కొన్ని రోజుల క్రితం డబ్ల్యూటీసీ ఫైనల్ జరిగిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఐసీసీ ఛైర్మెన్ జే షా దీనిపై చర్చించినట్లు తెలుస్తోంది. 4 రోజుల టెస్టు మ్యాచ్‌లకు ఆయన మద్దుత ఇచ్చినట్లు రిపోర్టులో తెలిపారు. 2027-29 సైకిల్‌కు ఆ విధానాన్ని మంజూరీ చేసినట్లు వెల్లడైంది. 2017లోనే ద్వైపాక్షికంగా నిర్వహించే సిరీస్‌లకు నాలుగు రోజుల టెస్టుకు ఐసీసీ అనుమతి ఇచ్చింది. గత నెలలో ఇంగ్లండ్, జింబాబ్వే మధ్య నాలుగు రోజుల టెస్టు జరిగింది. ఐర్లాండ్‌తోనూ 2019, 2023లో 4 డే టెస్టులు ఇంగ్లండ్ ఆడింది. సంప్రదాయకరమైన 5 రోజుల టెస్టును నిర్వహించేందుకు చాలా దేశాలు నిర్లిప్తంగా ఉన్నాయని, అయితే 4 రోజుల టెస్టులను నిర్వహించడం వల్ల.. మూడు టెస్టుల సిరీస్‌ను కేవలం మూడు వారాల్లోనే పూర్తి చేయవచ్చు అని రిపోర్టులో వెల్లడించినట్లు తెలుస్తోంది. 4 రోజుల మ్యాచ్‌ల్లో ఓవర్లను 98కి పెంచాలని భావిస్తున్నారు.

2025-27 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌ను 5 రోజుల ఫార్మాట్‌లోనే ముగించనున్నారు. మంగళవారం శ్రీలంక, బంగ్లాదేశ్ టెస్టు సిరీస్‌తో ఈ కొత్త సైకిల్ ప్రారంభం అవుతోంది. 2025-27 సైకిల్‌లో మొత్తం 27 టెస్టు మ్యాచ్ సిరీస్‌లు ఉంటాయి. దీంట్లో 17 సిరీస్‌లు రెండేసి మ్యాచ్‌ల ఉంటాయి. మరో ఆరు సిరీస్‌ల్లో మూడేసి మ్యాచ్‌లు జరుగుతాయి. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మాత్రం అన్ని 5 టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లు జరుగుతాయని రిపోర్టులో తెలిపారు.

## వరల్డ్ కప్ తర్వాత వీడ్కోలు

### న్యూజిలాండ్ కెప్టెన్ షాకింగ్ నిర్ణయం..!

**న్యూజిలాండ్:** న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె షాకింగ్ నిర్ణయం తీసుకుంది. నిరుడు మహిళల జట్టును పొట్టి వరల్డ్ కప్ విజేతగా నిలిపిన ఆమె.. వన్డేలకు అల్విదా చెప్పనుంది. వన్డే వరల్డ్ కప్ అనంతరం వన్డే ఫార్మాట్ నుంచి వైదొలగాలని ఆమె భావిస్తోందట. ఈ విషయాన్ని మంగళవారం ఈ విధ్వంసక ప్లేయర్ వెల్లడించింది. '50 ఓవర్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించేందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నా' అని డెవినె తెలిపింది. న్యూజిలాండ్ క్రికెట్ కూడా ఈ వార్తను ధ్రువీకరించింది.

'ఇన్ని రోజులు దేశానికి ప్రాతినిధ్యం వహించాను. ఇక వన్డేల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వన్డే వరల్డ్ కప్ తర్వాత రిటైర్మెంట్ పలకడం మంచిదని అనిపిస్తోంది. న్యూజిలాండ్ క్రికెట్ మద్దతు నాకు ఇన్నాళ్లు లభించడం అదృష్టంగా భావిస్తున్నా. వీడ్కోలుకు ముందు వైట్ ఫెర్న్స్‌కు నేను చేయగలిగినంత చేస్తాననే నమ్మకం నా సహచరులకు ఉంది.

యువ క్రికెటర్లతో నిండిన ఈ జట్టు ప్రయాణం గొప్పగా సాగాలని కోరుకుంటున్నా. వచ్చే 6 నుంచి 9 నెలలు ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా' అని డెవినె తెలిపింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 న మొదలు కానుంది. అక్టోబర్ 1న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో కివీస్ తలపడనుంది.



### 11వ నంబర్ ప్లేయర్‌గా..

న్యూజిలాండ్ మహిళల జట్టులో కీలక సభ్యురాలైన డెవిన్ వన్డే, టీ20ల్లో తన ముద్ర వేసింది. 11వ నంబర్ ప్లేయర్‌గా వన్డేల్లో అరంగేట్రం చేసిన తను.. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. 2020లో కెప్టెన్‌గా పగ్గాలు అందుకున్న డెవిన్ వెటరన్ సుజీ బేట్స్ తర్వాత కివీస్ తరఫున అత్యధికంగా 152 మ్యాచులు ఆడింది. విధ్వంసక ప్లేయర్ అయిన డెవిన్ వన్డేల్లో 8 సెంచరీలు, 16 హాఫ్ సెంచరీలు బాదింది. ఆల్‌రౌండర్‌గా రాణించిన తను.. 3,990 రన్స్ చేయడమే కాకుండా 107 వికెట్లు పడగొట్టింది.

## వన్డే బ్యాటింగ్ ర్యాంకులు.. టాప్ ప్లేస్ కొట్టేసిన స్మృతి మంధాన



**దుబాయ్:** భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన.. వన్డే బ్యాటింగ్ ర్యాంకుల్లో టాప్ ప్లేస్ కొట్టేసింది. తాజాగా రిలీజ్ చేసిన ర్యాంకుల జాబితాలో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. 2019 తర్వాత భారత వైస్ కెప్టెన్ మంధాన మళ్లీ ర్యాంకుల్లో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్.. ఇటీవల 19 పాయింట్లు కోల్పోయింది. దీంతో స్మృతి టాప్ వన్ నెంబర్ దిశగా దూసుకెళ్లింది. 727 రేటింగ్ పాయింట్లతో స్మృతి మందానా టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇంగ్లండ్ కెప్టెన్ నటాలీ స్కీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉంది. వోల్వార్డ్ 719 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. మందాన తర్వాత ర్యాంకు లిస్టులో ఉన్న ఇండియన్ బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ ఉన్నారు.

## సచిన్ జోక్యంతో దిగొచ్చిన ఇంగ్లండ్

### విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'..!

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు ఇంగ్లండ్ పర్యటన ఖరారైనప్పటి నుంచి పటౌడీ ట్రోఫీ గురించి చర్చ కొనసాగుతోంది. అందుకు కారణం ఈ ఏడాది నుంచి ఇరుదేశాల దిగ్గజాలు సచిన్- అండర్సన్ పేర్లతో ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ్ ప్రకటించడమే. ఈ నేపథ్యంలో భారత లెజెండరీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, బీసీసీఐ పెద్దలు పటౌడీ పేరు మార్చవద్దని ఈసీబీకి విన్నవించారు. సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షాలు సైతం ఆనవాయితీ ప్రకారం ఆయన పేరుతో ట్రోఫీ జరపాలని సూచించారు. ఈ ఇద్దరి విజ్ఞప్తితో దిగొచ్చిన ఇంగ్లండ్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.

'ఈ ఏడాది నుంచి భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌ను పటౌడీ పేరుతో కాకుండా సచిన్- అండర్సన్ ట్రోఫీగా నిర్వహించాలని ఈసీబీ నిర్ణయించింది. అయితే.. అలా చేయడం దిగ్గజ ఆటగాడైన పటౌడీని అగౌరపరచడమేనంటూ పలువురు భారత క్రికెటర్లు మండిపడ్డారు. తన పేరుతో ట్రోఫీ జరపాలనుకుంటున్న ఈసీబీకి టెండూల్కర్ ప్రత్యేక విన్నపం చేశాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరుదేశాల సిరీస్‌లో పటౌడీ పేరు ఉండేలా చూడాలని కోరాడు. దాంతో, సానుకూలంగా స్పందించిన ఈసీబీ.. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను కానుకగా ఇస్తామని తెలిపింది' అని మంగళవారం బీసీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.



### 75 ఏళ్లకు గుర్తుగా..

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు సిరీస్‌కు 2007లో 75 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఇరుదేశాల బోర్డులు ఇంగ్లండ్‌లో జరుగబోయే సిరీస్‌ను మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ పేరుతో నిర్వహించాలని నిర్ణయించాయి. అప్పటినుంచి 2024 వరకూ పటౌడీ పేరుతోనే ట్రోఫీని జరిపారు. అయితే.. నిరుడు జేమ్స్ అండర్సన్ వీడ్కోలు పలకడంతో అతడిని గౌరవించాలనుకుంది ఈసీబీ. అందుకే.. పటౌడీ ట్రోఫీకి మంగళం పాడి.. భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్ పేరును జతచేసింది. ఈ ఏడాది నుంచి సచిన్- అండర్సన్ ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ్ బోర్డు తెలిపింది.

### పటౌడీ, ట్రోఫీతో ద్రవిడ్ సంబురాలు..

జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. అంతకంటే ముందే సచిన్ అండర్సన్ ట్రోఫీని ఆవిష్కరించాలని ఈసీబీ భావించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సందర్భంగా లార్డ్స్ మైదానంలో ట్రోఫీ ఆవిష్కరణ వేడుక జరిపేందుకు ఏర్పాట్లు కూడా చేసింది. కానీ, జూన్ 12న అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం అనంతరం భారత క్రికెటర్లు విషాదంలో మునిగిపోయారు. దాంతో, ట్రోఫీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది ఈసీబీ. ఇరుబోర్డులకు ఆమోదయోగ్యమైన రోజున అంటే జూన్ 19న ఆవిష్కరణకు సిద్ధమవుతోంది ఇంగ్లండ్ బోర్డు.

# కర్నాటకలో థగ్‌లైఫ్ విడుదలకు లైన్‌క్లియర్



## అడ్డుకోవడం సరికాదంటూ సుప్రీం ఆదేశం

**టాకీస్:** 'థగ్ లైఫ్' చిత్ర బృందానికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కమల్‌హాసన్ నటించిన ఈ సినిమా కర్ణాటకలోనూ విడుదల చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కన్నడ భాషపై కమల్ చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఈ సినిమాను కర్ణాటకలో నిషేధించిన సంగతి తెలిసిందే. దీనిపై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ మేరకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల వల్ల ఆ సినిమాను నిలిపివేయాలంటూ బెదిరించిన సంఘాలను సుప్రీం హెచ్చరించింది. అలాంటి బెదిరింపులు చట్టబద్ధం కాదన్న అత్యున్నత న్యాయస్థానం.. థియేటర్‌లలో ఏది ప్రదర్శించాలో నిర్ణయించే అధికారం ఆ సంఘాలకు లేదని స్పష్టంచేసింది. ఎవరైనా ఒక ప్రకటన చేసినప్పుడు దాన్ని మరో కామెంట్‌తో ప్రతిఘటించే స్వేచ్ఛ ఉంది కానీ.. థియేటర్‌లు తగలబెడతామని బెదిరించే అధికారం ఎవరికీ ఉండదని సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. కర్ణాటక ప్రజలు కమల్‌హాసన్‌తో విభేదించే స్వేచ్ఛను కలిగిఉన్నారని.. అదే సమయంలో ప్రాథమిక హక్కులను కూడా కాపాడాలని కోర్టు పేర్కొంది. ఒక సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత దాన్ని విడుదల చేయాల్సిందేనని సుప్రీం ఆదేశించింది. దాన్ని చూడాలా, వద్దా అనే అధికారం పూర్తిగా ప్రజలకు ఉంటుందని.. బెదిరింపుల ఆధారంగా సినిమాను ఆపకూడదని స్పష్టంచేసింది. చిత్ర నిర్మాతలు దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు నుంచి తనకు బదిలీ చేసుకున్న సుప్రీంకోర్టు.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందనను తెలియ జేయాలని ఆదేశించింది. ఈ విషయంలో నటుడు క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది.

# ఢీ సీక్వెల్‌కు నేను రెడీ అంటున్న మంచు విష్ణు




**టాకీస్:** తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు మంచు విష్ణు. జూన్ 27న ఈ సినిమా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో విష్ణు తన హిట్ సినిమా 'ఢీ' సీక్వెల్ గురించి మాట్లాడారు. 'ఢీ' సినిమా సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. 'ఆ సినిమా దర్శకుడు, నేను కలిసి సీక్వెల్ కోసం ప్రయత్నిస్తున్నాం. నేను ఆ చిత్రాన్ని ఎంతో ప్రేమతో చేశాను. ఏదో ఒకరోజు దర్శకుడు దాని సీక్వెల్ స్క్రిప్ట్‌తో నన్ను కలవాలని కోరుకుంటున్నాను. అదంతా రచయిత చేతుల్లోనే ఉంటుంది. స్క్రిప్ట్ సిద్ధమైన మరుసటి రోజే దాని షూటింగ్‌ను ప్రారంభిస్తాను' అని మంచు విష్ణు తెలిపారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో విష్ణు, జెనీలియా జంటగా నటించిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'ఢీ'. శ్రీహరి, జయప్రకాశ్‌రెడ్డి, బ్రహ్మానందం కీలక పాత్రలు పోషించారు. 2007లో వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, మంచు విష్ణు కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్స్‌లో ఒకటిగా నిలిచింది. అలాగే తన మనసులో ఉన్న మరో కథను కూడా బయటపెట్టారు. ప్రస్తుతం తాను 'కన్నప్ప' ప్రచారంలో బిజీగా ఉన్నట్లు చెప్పిన విష్ణు.. వేరే సినిమాలు ప్లాన్ చేయడం లేదని వెల్లడించారు. అయితే, 1947 నేపథ్యంలో సాగే పీరియాడిక్ సినిమా చేయాలని తనకు ఎప్పటినుంచో ఆలోచన ఉందన్నారు. ఆ ఆలోచనను నిజం చేయడం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. గతేడాది విడుదలై హిట్‌ను సొంతం చేసుకున్న ఫహద్ ఫాజిల్ 'ఆవేశం' సినిమా తెలుగు రీమేక్ చేయాలని అనుకున్నట్లు మంచు విష్ణు చెప్పారు. అయితే, అప్పటికే ఆ సినిమా రైట్స్ మరొకరు సొంతం చేసుకున్నారని అన్నారు.

## కుబేరతో అలరించనున్న ధనుష్..రష్మిక

**టాకీస్:** ఎన్నో వైవిధ్యమైన పాత్రలు చేస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు నటుడు ధనుష్. సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి హాలీవుడ్ హీరోల ప్రశంసలు అందుకుంటున్నారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'కుబేర' జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ధనుష్ మ్యాష్‌అప్ వీడియోను ప్రదర్శించారు. అది చూసిన





అభిమానులు గూస్‌బంప్స్ వచ్చేలా ఉందంటూ అభిప్రాయపడుతున్నారు. తాను హాలీవుడ్ సినిమాలో నటిస్తానని చెబితే ప్రజలు నవ్వేవారని ధనుష్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇకపోతే ఇదే సినిమాలో రష్మిక నటించారు. నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకొని వరుస సినిమాలతో అలరిస్తున్నారు రష్మిక. 'కుబేర'తో జూన్ 20 నుంచి సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మ్యాష్‌అప్ వీడియో ప్రస్తుతం అందరినీ ఆకట్టు కుంటోంది. ఇందులో ఆమెపై ఇండస్ట్రీలో అగ్ర హీరోలు ప్రశంసలు కురిపించడం చూపించారు.. అలాగే తాను కెరీర్ ప్రారంభంలో ఓ ఆడిషన్ ఇస్తే రిజెక్ట్ చేశారంటూ రష్మిక ఓ ఇంటర్వ్యూలో పంచుకున్న వీడియోను ప్లే చేశారు.




## నటించడమే రాదన్నారు.. విమర్శలతోనే పట్టుదల పెరిగిందన్న అనుపమ

**టాకీస్:** సొగసైన అందంతో కుర్రాళ్ల హృదయాలని దోచుకుంటున్న అందాల ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. ప్రధానంగా తెలుగు, మలయాళం, తమిళ చిత్రాలలో నటిస్తోంది. 18 ఫిబ్రవరి 1996 న కేరళలోని ఇరింజలకుడాలో జన్మించిన అనుపమ తన నటనా జీవితాన్ని 2015 లో విడుదలైన "ప్రేమమ్" అనే మలయాళ చిత్రంతో ప్రారంభించింది. 2016 లో అనుపమ "అ ఆ" చిత్రంతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఈ చిత్రంలో ఆమె నాగవల్లి పాత్రను పోషించి, తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు . తాజాగా నటి అనుపమ పరమేశ్వరన్ తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న విమర్శలు, ట్రోలింగ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది.

మలయాళంలో తాను ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ఈ చిత్రానికి ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నటుడు సురేశ్ గోపి ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. థ్రిల్లర్ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంతో మలయాళ ప్రేక్షకులను కొత్త కోణంలో మెప్పిస్తానని అనుపమ అంటుంది. ఇక ఈ మూవీ ప్రచార కార్యక్రమంలో భాగంగా, అనుపమ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. కెరీర్ తొలినాళ్లలో మంచి నటి కాదంటూ నేను తీవ్ర విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కొన్నాను. ఆ విమర్శలు మొదట్లో చాలా బాధించాయి. అవే తనలో నమ్మకాన్ని పెంచాయని, నటిగా ఎదగాలన్న కసిని పెంచాయని చెప్పుకొచ్చింది అనుపమ. కోవిడ్ కాలంలో తాను వ్యక్తిగత, వృత్తిపరమైన సవాళ్లు ఎదుర్కొన్నట్టు పేర్కొంది.అప్పట్నుంచి కథల ఎంపిక విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని గ్రహించిందట. ప్రేక్షకులకు చేరువయ్యే బలమైన కథలవైపు దృష్టి సారించాలనే నిర్ణయానికి వచ్చినట్టు అనుపమ స్పష్టం చేసింది. దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తనపై నమ్మకాన్ని ఉంచి 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' లాంటి ఆసక్తికర చిత్రంలో అవకాశం ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు అనుపమ.ఈ నేపథ్యంలో తనను ఎల్లప్పుడూ సపోర్ట్ చేస్తున్న అభిమానులతో పాటు, విమర్శించిన వారికి కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి విమర్శలే నన్ను ధృడంగా మార్చాయి అని అనుపమ పేర్కొంది.

## విజయ్‌సేతుపతి, పూరి సినిమా టీమ్‌లో చేరిన సంయుక్త

**టాకీస్:** విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నటి సంయుక్త జాయిన్ అయినట్లు తెలుపుతూ టీమ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. ఆమె నడకలో హుందాతనం.. కళ్లల్లో ఆగ్రహం.. అంటూ సంయుక్తకు స్వాగతం పలుకుతూ ఆమెతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇందులో ఆమె పాత్ర కీలకంగా ఉండనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు భాగమైన విషయం తెలిసిందే. ఇక ఈ చిత్రానికి 'బెగ్గర్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు మొన్నటివరకూ వార్తలు వచ్చాయి. తాజాగా 'భిక్షాందేహి' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన



కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. దర్శకుడిగా విజయాన్ని అందుకునేందుకు గత కొంత కాలంగా ఎదురుచూస్తున్నారు పూరి జగన్నాథ్. ఆయన గత చిత్రాలు 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందు కోలేకపోయాయి. దీంతో హిట్ అందుకోవడమే లక్ష్యంగా విజయ్ సేతుపతితో కొత్త ప్రాజెక్ట్ ప్రకటించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక సంయుక్త వరుస ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శీను దర్శకత్వంలో రానున్న 'అఖండ 2'లోనూ ఆమె భాగమయ్యారు. ఇటీవలే చిత్రబృందం ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. ఇందులోనూ ఆమెది నటనకు ప్రాధాన్యమున్న పాత్రని తెలుస్తోంది.



## సిరీస్‌గా రాబోతున్న సూర్య 'రెట్రో'..



**టాకీస్:** తమిళ సూపర్ స్టార్ సూర్య నటించిన సూపర్ హిట్ చిత్రం రెట్రో. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, శ్రియ ప్రత్యేక గీతంలో కనిపించారు. 65 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తెలుగులో మిశ్రమ స్పందనలను అందుకోగా.. తమిళంలో మాత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు. నాలుగు నెలల్లో 'రెట్రో' సిరీస్ వెర్షన్ విడుదల చేయాలని తాను ఆలోచిస్తున్నట్లు సుబ్బరాజు ప్రకటించారు. ఈ ఎక్స్‌టెండెడ్ వెర్షన్‌లో కేవలం తొలగించిన సన్నివేశాలు మాత్రమే కాకుండా, అనేక భావోద్వేగపూరిత సన్నివేశాలు మరింత వివరంగా ఉండేలా ప్లాన్ వేస్తున్నానని ఆయన తెలిపారు. అయితే, ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్ సుముఖంగా లేదని, అందుకే వారితో చర్చలు జరుపుతున్నానని సుబ్బరాజు పేర్కొన్నారు. 'రెట్రో'ను కొన్ని ఎపిసోడ్‌లుగా తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని, ఒక్కో ఎపిసోడ్ సుమారు 40 నిమిషాలు ఉండేలా చూస్తున్నానని చెప్పారు. హాస్యం, ప్రేమ, యాక్షన్ వంటి అంశాలను ఒక్కో ఎపిసోడ్‌లో హైలైట్ చేయాలనేది తన ఆలోచన అని సుబ్బరాజు వెల్లడించారు.

## నేను శైలజ దర్శకుడితో కొత్త సినిమా మొదలుపెట్టిన రవితేజ

**టాకీస్:** మాస్ హీరో రవితేజ ఒకవైపు మాస్ జాతర సినిమాను విడుదలకు సిద్ధం చేస్తునే మరోవైపు తన కొత్త సినిమాను పట్టాలెక్కించాడు. రవితేజ 76వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తుండగా.. ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి సినిమాస్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు.

హైదరాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్‌లో ఈ సినిమా షూటింగ్ నేడు మొదలైంది. రవితేజతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా పూర్తిస్థాయి కుటుంబ వినోదాత్మక చిత్రంగా ఉంటుందని, రవితేజ తన మార్క్ కామెడీ టైమింగ్, మాస్ అప్పీల్‌తో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమా కోసం రవితేజ సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, ఏ. ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం రవితేజ "మాస్ జాతర" అనే మరో సినిమాలో కూడా నటిస్తున్నారు, ఇది ఆగస్టు 27న విడుదల కానుంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.